# ఏలూరెళ్ళాలి

పెట్టే బేడా తలక్రింద పెట్టుకుని, హోల్డాలు విప్పుకుని చిన్న ఇంటరు బోగీలో పై బెర్తుమీద పడుకొన్నాను. పదకొండే అయిందో, పన్నెండే అయిందో మహా స్వతంత్రంగా గుంజి గుంజి ఎవరో లేపారు. ఆవలిస్తూ కళ్ళు విప్పి చూస్తే తెల్లని పితంతువు. ఎవర్తో నలభై ఏళ్ళు మళ్ళిన మనిషి, సగం నెరిసిన సకేశ కనబడ్డాది.

కాళ్ళూ చేతులూ కూడదీసుకుని కూర్చుని చూస్తే బోగీలో ఇంకెవరూ లేరు. కిటికీలోంచి నిడదవోలు స్టేషను పోలిక కనబడ్డాది.

"ఎవరండీ?" అని అడిగాను. ఆవిడ నవ్వుతో మొహం రెండు చెక్కలు చేసుకొంటూ 'దిగవోయ్' అన్నాది. పూర్తిగా ఎళ్ళబెట్టిన ఆవిడ నోట్లో విద్యుద్దీపం వెలుగుపడి, అంగుట్లో దానెమ్మ మొగ్గలా కొండనాలిక కనబడ్డాది. ఏపిలు పళ్ళలా ఎర్రగా రక్తం చిమ్ముతూ బుగ్గలమీదకు తోసుకుపోయి కళ్ళు కూడుకుపోయాయి. మెత్తగా, బొద్దుగా రెండు ఆర్ద్ర పురుగుల్లా కిందికి వేళ్ళాడిన అధరోష్ఠం లోపల ముత్యాల కోవలాగ కింది పళ్ళ వరస మెరసిపోతున్నాది.

"ఎవరండీ" అని మళ్ళా అడిగేను.

"ముందు దిగు చెబుతా?" అన్నాది! కిందికి దూకేను, గోచీ వేలాడిపోతూ, కట్టువూడి పంచ జారిపోతూ ఉంటే నవ్వుతూ కుచ్చెళ్ళు పట్టుకుని ప్రమాదాన్ని కాపాడింది. నేను నివ్వెరపడి ఆవిడ చేతిలో కుచ్చెళ్ళు లాక్కుని పంచకట్టుకుని ఆవిణ్ణి చూశాను. కాషాయరంగు మైసూరు సిల్కు పంచ, మధ్యమధ్య జరీపోగుల్తో నల్లని వెడల్పంచుది కట్టుకొంది. బొద్దుగా గుండ్రంగా ఐదడుగుల ఎత్తుమనిషి. పంచ కాషాయరంగులో బంతుల్లా జబ్బలు కలిసిపోయి బంగారు ఛాయతో మెరసిపోతున్నాయి.

"చాలా కాలమైంది. మరచిపోయావు కావును!" అన్నాది. నా బుఱ్ఱకేమీ పాలుపోలేదు. బంధువర్గంలో అంత లేడీలాంటి వితంతువు. నాతొక్కవలసినది, ఎక్కడా లేదు. రెప్ప వాల్చకండా చూడ్డం ప్రారంభించాను.

"నీ కొడుకు భోజనాని కెళ్ళాడు; అలా తెల్లబోతావేఁమిటి?" అన్నాది. ఈవిడెవరు? నా కొడుకెవరు? నా కొడుకింకా మూడునెల్లవాడు. పురిటికెళ్ళిన పెళ్ళాం పుట్టింట ఉన్నది. ఇదెవరా, ఈ దేవతలాంటి దెయ్యం అనుకొన్నాను.

"ఈ రాత వొచ్చిన తరవాత చూడలేదు. ఔను ఎలా పోలుస్తావు? చూసి అబ్బో తొమ్మిదేళ్ళయింది. మనిషినంతా మారిపోయాను" అని ఏడుపు మొదలు పెట్టింది.

"నేనింకెవర్నో అనుకొని పొరపడుతున్నారు" అని చెప్పేను.

"నేనా పొరపాటు పడుతున్నాను? నువ్వు విజయనగరంలో చదువు కోలేదూ?"

"చదువుకొన్నా!"

"నీ పేరు పురుషోత్తం కాదూ?"

"ఔను!"

"ఇప్పుడేనా పోల్చావా?"

ఆలోచించాను. ఎక్కడా స్ఫురణకి రాలేదు. ఆవిడ అంటున్నాది.

"ఔను. మొగాళ్ళని రాతిగుండె. నెనరాపేక్షలుండవు. జ్ఞాపకాలుండవు. ఆడవాళ్ల మనస్సులలా ఉంటాయా? హయ్యో, మళ్ళా ఎవరైనా వొస్తారు. కూర్చుని నాలుగు మాటాడవూ?"

"మీ ఇంటిపేరు?"

"ఆకాటి కొచ్చిందీ? కులగోత్రాలు చెప్పుకోవలసొచ్చిందీ! దైవికంగా ఇన్నాళ్ళకి కలిశాం గదా అని పొంగిపోతున్నా. నీ పేరు తలచుకోని రోజు లేదు, ఇంత ఆదరవు కలిగించావు అంతే చాలు! ఐతే పోల్చుకోలేవు" అని ప్రశ్నించి వెఱ్ఱిమొహం పెట్టి ఏడవడ మారంభించింది. ఇదెక్కడ ఖర్మం? నిర్ఘాంతపోయి మొరడులా నిలబడ్డా. చిన్న ఏడుపుతో మిలాయించి ఆవిడే ప్రారంభించింది.

"మొహం చూడగానే పోల్చి పట్టేను. పెట్టిమీద పేరు చదివి నిర్థారణ చేసుకున్నాను. టి. పురుషోత్తం బి. ఏ. అని చదివి బియ్యే పేసయ్యావా అని సంబరపడ్డాను. అంత జ్ఞాపకం లేకపోనా? అయితే ఓయ్ మీ యింటిపక్క అడిటరుగారుండేవారు మరిచిపోయా?" ఆ మాటతో నా గుండె చెరువై పోయింది.

"మాణిక్యమ్మగారా? ఎంత మారిపోయారు?" నెత్తి నోరూ కొట్టుకొన్నాను.

నాకప్పుడు పద్దెనిమిదో యేడు. ఇంటరు చదువుతున్నా. మా ఇంటి పక్క మేడలో ఆడిటరుగారుండేవారు. అరవైయేళ్ళాయన. ఆయన రెండో పెళ్ళి పెళ్లాం మాణిక్యమ్మగారు. ముప్పై, ముప్పైయైదేళ్ళావిడ. పిల్లా పీచూ లేక కర్రకట్టి సన్నంగా గాజుబొమ్మలాగుండేది. వాళ్లూ మేము ఒక్క కుటుంబంలా గుండేవాళ్ళం.

మాణిక్యమ్మగారికి ఆ తరవాత వైధవ్యం, ఊబశరీరం- సగం నెరసిన తలా ప్రాప్తించాయి కాబోలు.

ఓనాడు కాలేజీనుండి రెండింటికి వస్తూవుంటే మాణిక్యమ్మగారు పిలిస్తే వాళ్ళింటి కెళ్ళాను. "కూర్చోవోయ్?"అంటూ మడతకుర్చీ వాల్చింది. చెమటగా ఉంటే పక్కనున్న విసనకర్ర తీసా.

"నే విసురుతా కూర్చో'' అంటూ ఆవిడ విసనకర్ర లాక్కుంది.

"ఇంకా నయం?" అన్నాను.

"తప్పు లేదోయ్!" అంటూ విసరడ మారంభించింది.

"కాఫీ తాగి కాలేజీకి పోవాలి!" అని లేచాను.

"ఇక్కడ తాగకూడదా ఏమిటి!" అన్నాది. లోపలకెళ్ళి ప్లేటులో రెండు రసగుల్లాలు వెండిగ్లాసుతో మంచినీళ్ళు తెచ్చిపెట్టింది.

"హోటల్లో తెప్పించారా?'' అనడిగాను.

"నేను చేశానోయ్!" అన్నాది.

మన ఆడవాళ్ళ స్వాధీనంలో యీ మిఠాయిలుంటా యనుకోలేదు. ఆవిడ విసురుతూ అట్టేచూసి "ఇంక నువ్వు గడ్డాం గీయిస్తూ ఉండాలోయ్" అన్నాది.

చిన్ననూగు గెడ్డాం అప్పుడప్పుడే ప్రారంభమైంది. మంగలాడిచేత తీయించుకోడానికి సిగ్గుపడి మానుకొస్తున్నాను. "పెద్దవాడివయావు. పెద్ద పిల్లను చూసి పెళ్ళిచెయ్యాలి" అన్నాది. వొళ్ళు చచ్చిపోయింది. మాట్లాడ కుండా ముంగిలా తిన్నాను. రెండో రసగుల్లా మొహమ్మొత్తింది. ఆవిడ లోపలకెళ్ళి మామిడికాయ తొక్కుపచ్చడి, కాఫీ తెచ్చిపెట్టింది. దాంతో లేచాను.

"ఏమీ తోచడంలేదు రెండునిముషాలు కూర్చోవోయ్" అన్నాది.

"కాలేజీ?"

"ఈ పూటమానీ!"

"బాబో, గ్రూపుక్లాసు!"

"మా మంచివాడవు రద్దూ!" అని జబ్బపట్టుకొని వాళ్ళ గదిలోకి లాక్కెళ్ళి "తమలపాకు లేసుకో చెబుతాను" అన్నాది.

ఆవిడదగ్గిర బాగా చనువే. ఎప్పుడూ వేళాకోళాలు, ఎకసెక్కాలు ఆడుకుంటూ కలివిడిగా వుండేవాణ్ణి. ఒంటరిగా వుండగా ఆవిడ అల్లరి పెడితే చెడ్డ లజ్జవేసింది. తమలపాకులేసుకుని బయలుదేరాను.

"కాలేజీ ఇవాళ శెలవెట్టు" అని రెండు బుగ్గలూ పట్టుకొని సాగ దీస్తూ చేతులురెండూ నా బుజాలు మీదికి జార్చి నన్ను తనమీదికి లాక్కుంటూ మంచంమీద కూర్చోపెట్టింది.

నాకు తారకమంటుకు పోయింది. వాళకం తొలినుంచే బోధపడు తూనే వుంది. అప్పటికి నసాళమంటుతుంది. ఆడవాళ్ళంటే అవస్థ ఆరంభ మైనా మాణిక్యమ్మగారిని మాత్రం ఆ దృష్టితో ఎప్పుడూ చూడలేదు. నాకు పద్దెనిమిదేళ్ళు, ఆవిడకి చూస్తే ముప్పయ్యారేళ్ళు? గుండెల్లో బితుకుపట్టు కున్నా గది విడిచి పోబుద్ధి పుట్టలేదు. మూర్తపెళ్ళికూతురిలా మొహం వేలేశాను.

"రేపు యీ గెడ్డాం తీయించవోయ్. నున్నగా పువ్వులాగుండవల సిన మొహం గజ్జికాకరకాయలాగుంది" అని గడ్డాం తణివి "మొదటిసారి వెంట్రుకలు మెత్తగానే ఉన్నాయి" అంటూ నా మొహాన్నెత్తి కళ్ళని సాసర్లలా చేసుకొని నాలోకి దృష్టి నిలబెట్టిచూస్తూ, "నేనిలా చేశానని ఎక్కడా చెప్పకేం — నేనిలాంటిదాన్ననుకోకేం—కుర్రాడివి చనువుగా

ఉన్నావని అవస్థపడుతున్నాను — మరేం అనుకోకేం!" అంటూ నన్ను పట్టుకు నూపేస్తూ, "నీకు సైకిలు కొనిపెడతాను-ఉంగరం చేయిస్తాను-" అని మొహమంతా ముద్దులతో తడిపేసింది, మొహం నానిపోయింది.

ఇంట్లో దొంగనీ, గాదిలో పందికొక్కునీ ఎవరు పట్టుకోగలరు? ఆడిటరుగారు తరువాత ఐదు నెల్లున్నారు. ఆ కాలం నా జీవితంలో ఒక శృంగార ప్రబంధం. ఆ నూట ఏభైరోజులూ నూట ఏభై సువర్ణ పుటలు. అందులో ప్రతిక్షణమూ ఒక అమృతభావం. ఆ ప్రబంధం అల్లికకి జిగిబిగికి అల్లసానివాని తాటాకులుమీది అక్షరాలు ఎందుకు మారుతాయి? వెనక్కి తిరిగిచూస్తే నా జీవితం గొంగళీలతో నిండిన ములగచెట్టు. ఆ తరుశాఖల్లో ఐదు మాసాలు ఐదు తేనెపట్లు.

మా ఎడబాటు పెద్ద ట్రాజడీ. శలవులకి స్వగ్రామం వెళ్ళి కాలేజీ తియ్యగానే తిరిగొస్తే వాళ్ళు బదిలీ అయి పై గ్రామం వెళ్ళిపోయారు. మళ్ళా వాళ్ళ పత్తా తెలియలేదు. తరువాత ఆవిడకోసం నేనుపడ్డ యమ యాతనంతా రాస్తే చక్కని విరహకావ్యాలవుతాయి. ఎప్పుడైనా జాగ్రత్తగా రాయాలి.

బి.ఎ. పేసై, సర్వీసు కమిషనులో ఒడ్డెక్కి, గవర్నమెంటు ఉద్యోగంకాగానే నచ్చినపిల్లని పెళ్లాడా, మూర్తపుగదిలో లజ్జావనత వదనయైన పెళ్ళాన్ని చూస్తే నేను మాణిక్యాంబగారి దగ్గరపడ్డ అవస్థ, మాణిక్యాంబగారు జ్ఞాపకమొచ్చి పెళ్ళాన్ని దగ్గర పెట్టుకొని, మాణిక్యాంబగారిపై మనస్సు లగ్నం వేసుకొని బాధపడ్డా.

ఈనాడు ఆవిడ ప్రత్యక్షంగా నిలబడితే పోల్చుకోలేని పరిస్థితి వచ్చింది.

"ఎంత మారిపోయారు!" అన్నాను.

"తొమ్మిదేళ్ళయింది. అవస్థలన్నీ మారిపోయాయి. అంతా భగవత్సంకల్పం. ఆఖరికిలా కలిశాం. ఎక్కడ కెళుతున్నావు?" అన్నాది.

"బెజవాడ."

"ఎందుకూ?"

"అక్కడ నాకుద్యోగం."

"ఇంకనేం దగ్గరలోనే ఉన్నావు. పెళ్ళయిందా?"

"నాకిద్దరు పిల్లలు. ఏణర్థం అమ్మాయీ, మూణ్ణెల్ల అబ్బాయీ!"

"పెళ్ళానికిద్దరను నీకు ముగ్గురు పిల్లలు!"

"ముగ్గురా?"

"ఔను. నాకో చక్కదనాల కొడుకుని కన్నావు!"

నా వొళ్ళంతా గగుర్పొడిచింది.

"తొమ్మిదేళ్ళవాడు. సామ్యం చెప్పినట్టొచ్చింది. నీ మూడు మూర్తులూ వచ్చేక చూద్దువుగాని ఎలాగో నన్నుద్ధరించేవు. నీ వర ప్రసాదం ఉండబట్టి ఆయన గణించిన డబ్బు, పిత్రార్జితం దఖలుపడ్డాయి. లేకపోతే నా మరుదులు ముండని చేసి మూలకూచోపెడుదురు!" అన్నా దావిడ.

"ఎవ్వాళ్ళో ఉన్నారు?"

"మాదసలేలూరోయ్. అక్కడ నేనే మేడవేయించాను. నీ కొడుకు బాగా అదృష్టవంతుడు పదివేలు కంగోరా లున్నాయి. పదిహేనువేల కొబ్బరికాయ వొస్తుంది. తొంభై పుట్ల ధాన్యం వస్తాయి. ఇంటికిరా చూద్దువు గాని!"

హోటల్లో పూరీలూ, కాఫీ తాగివొచ్చేడు అబ్బాయి.

"అమ్మా నువ్వు పళ్ళైనా తినవా?" అంటూ తల్లి వొళ్ళోకెళ్ళాడు. సరిగ్గా నా కొడుకు. సరిగ్గా నా ప్రతిబింబం. నాకు పద్దెనిమిదేళ్ళప్పుడు నాకన్నా పద్దెనిమిదేళ్ళు పెద్దదానికి—నాకు తెలియకుండాపుట్టి —నన్నెర గని ఎరగలేని నా కొడుకు తొమ్మిదేళ్ళాయి ఏలూరులో పెరుగుతున్నాడు!

"అబ్బాయిని చూచావా?" అన్నాదావిడ.

చూడకేం? కళ్ళలోకి పంచప్రాణాలూ వొచ్చి వత్సని వాత్సల్యంతో చూచాయి.

"ఇలారా అమ్మా!" అని పిలిచాను. చనువుగా దగ్గర కొచ్చాడు. చేరదీసుకొని పరిష్వంగ సుఖమనుభవించాను. "మాణిక్యాంబగారు ముక్కుకి గుడ్డపెట్టుకొని వలవల ఏడ్చారు.

"ఏం చదువుతున్నావు నాయనా?" అన్నాను.

"సెకండ్ ఫామ్." అన్నాడబ్బాయి.

"వాడితో నువ్వు ఇంగ్లీషు మాట్లాడగలవా? మూడేళ్ళయి కిరస్తానీ మేష్టర్ని పెట్టి చెప్పిస్తున్నాను!" అన్నాదావిడ.

"I am below ten తప్పా రైటా చెప్పండి చూతాం!" అన్నా డబ్బాయి.

నిజంగా సమస్యలోపడ్డా. రైటులాగే కనబడుతున్నాది. తప్పేమో అని భయం వేస్తూన్నాది. బియ్యేలు పేసైనా ఎందుకూ? ప్రొఫెసర్లు సరియైన ఇంగ్లీషు చెప్పగలిగితేగా కాలేజీల్లో!

"నువ్వే చెప్పు బాబూ!" అన్నాను.

"శుద్ధ తప్పు. I am under ten అనాలి. ఆ సంగతి మా మేష్టరుగారికి తెలిసిందికాదు." అని కిచకిచ నవ్వే డబ్బాయి.

"రేపు ఆఫీసుకు పోవాలి. ఆదివారం వొస్తా!"

"నేను స్టేషనుకొస్తాను!"

"రా నాయనా!"

అబ్బాయి ఆవులిస్తూ నిద్దరమొహం పెట్టేడు. మీద హోల్డాలుదింపి కింద బెర్తునిండా పరచి అబ్బాయిని పడుకోబెట్టి, మీదచెయ్యి వేసుకుని కూర్చున్నాను. కైకారం వచ్చేవరకూ ఏవేవో కబుర్లు చెప్పుతూ సంతోషం కలిగించేడు. పూళ్ళ రాకండానే కళ్ళు మూసుకొని గుర్రుపెట్టేడు. దెందులూరు వొచ్చింది.

"దగ్గిర పడిపోయింది. ఆదివారం రావాలిసుమా!" అని కళకళ్లాడిందావిడ.

ఏముంది ఏడు నిముషాలలో ఏలూరొచ్చింది. ఇదరినీ గేటుదాకా దిగబెట్టి బండివాడి కప్పజెప్పేను.

"వెళ్ళొస్తాము!" అన్నాదావిడ.

"ఆదివారం వొస్తారా?" అన్నాడు కొడుకు.

"ఏలూరెళ్ళాలి!"